


బంగారాన్ని గీటురాయి పరీక్షిస్తుంది. మనిషిని బంగారం పరీక్షిస్తుంది.

○ ○ ○

"వామనరావు వచ్చాడే ఒడుగుకి?"

ఓ ఆనప పెట్టెమీద కూర్చుని హిచ్ కాక్ ఎడిట్ చేసిన కథలు చదువుతుంటూంటే అన్నాడు నాతో పెద్దమ్మ కొడుకు.

"అవును. వచ్చాడు" అన్నాను పుస్తకంలోంచి తల తిప్పకుండానే.

"వస్తాడనుకోలేదు."

"వచ్చాడుగా" అన్నాను పేజీ తిప్పుతూ.

"జాగ్రత్తగా వుండాలి!"

రహస్యం చెబుతున్నట్లుగా అన్నాడు.

"అవును."

"దొంగబుద్ధి దొంగబుద్ధే. ఏది కనపడితే అది తీసుకువెళ్ళి అమ్మేస్తాడు. తర్వాత మొత్తుకుని లాభంలేదు."

నేను సంభాషణ పొడిగించడం ఇష్టంలేక మౌనంగా వుండిపోయాను. చదువుతున్న కథ ఉత్సాహంగా వుంది గనక.

"పిలవకుండా వచ్చినట్టున్నాడు."

నా మౌనం గమనించి, అరనిమిషం తర్వాత వెళ్ళిపోయాడు పెద్దమ్మ కొడుకు వామనరావు రాక ఒడుగుకు వచ్చిన అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

వామనరావు సంగతి తెలియనివాళ్ళు ఎవరూ లేరు మా బంధువుల్లో. ఎందుకంటే ఎప్పుడో ఒకప్పుడు వామనరావులోని చెడ్డని రుచి చూసినవాళ్ళే అంతా.

వామనరావు దొంగ.

పదహారేళ్ళుంటాయి వామనరావుకి.

చాలా అమాయకంగా కనబడతాడు వామనరావు. చూడటానికి పచ్చటి శరీరంనూనూగు మీసాలు. ఎవరూ వాడిని చూస్తే దొంగ అనుకోలేరు.

నాలుగేళ్ళ క్రితందాకా- అంటే పన్నెండేళ్ళదాకా వాడంత మంచివాడు చుట్టాల్లో ఎవరూలేరు అనిపించుకున్నాడు. ఎంతో బుద్ధిగా ఉండేవాడు చదువు సరిగా అబ్బకపోయినా—

కాని, పదమూడేళ్ళు వచ్చాక వాడిలోని మంచితనం అంతా ఎగిరిపోయింది. కారణం, బహుశా వాడి నాన్న మరణించటమే అయి ఉండచ్చు. అడ్డు పెట్టేవాళ్ళు లేకపోవడంవల్ల విచ్చలవిడిగా తిరిగేవాడు. చెడు సావాసాలు అబ్బాయి.

డబ్బు అవసరం ఎక్కువయినకొద్దీ నెమ్మదిగా చిల్లర మల్లర దొంగతనాలకి దిగాడు ఇంట్లో. కొన్నాళ్ళకి ఇంట్లో తెలిసింది దాడి దుర్గుణం కాని అప్పటికే ఇంట్లోని విలువయిన వస్తువులన్నీ మాయం అయిపోయాయి.

తర్వాత బంధువులిళ్ళకి వెళ్ళినప్పుడు చేతికందినది ఎత్తుకుపోయి అమ్మేసేవాడు. మంచినీళ్ళు ఇస్తే, తాగి, స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాస్ జేబులో వేసు కెళ్ళిపోయినప్పుడు మామయ్య నమ్మలేకపోయాడు వామనరావు ఆ పని చేశాడంటే.

కాని క్రమంగా ఇతరుల ఇళ్ళలో కూడా ఇలా జరగటంవల్ల, చుట్టూ అందరికీ తెలిసిపోయింది వామనరావు సంగతి. వాడి చెడు తిరుగుళ్ళు, చెడు అలవాట్ల గురించి కూడా తెలిసిపోయాయి. వీలయినంతవరకు ఇంటికి వాడు రాకుండా చూస్తారు అప్పటినుంచి.

ఇకనమిక్స్‌లో డబ్బు గురించిన ఓ ఛాప్టర్‌లో "పర్చేజింగ్ పవర్" గురించి వస్తుంది, అంటే కొనుగోలు శక్తి. వామనరావు దగ్గర "సెల్లింగ్ పవర్" ఉంది. అంటే అమ్మగల శక్తి. ఎటువంటి వస్తువునయినా అమ్మేయ గలడు.

వామనరావులోని అమ్మగల శక్తిని గురించి చెప్తూ జోక్ చేస్తూం టాడు పెదమామయ్య ఎప్పుడూ.

"నా దగ్గర ఉన్న ఓ సంచీ యిచ్చి కూరలు తీసుకురమ్మని చెబితే. వాడు ఆ సంచీ తీసుకువెళ్ళి ఎంతసేపటికీ రాలేదు. వాడికోసం వెడితే, ఓ కట్ట బీడీలు కొనుక్కుని తాగుతున్నాడు. సంచీ ఏదిరా అని అడిగితే అమ్మే శానని చెప్పాడు. కట్ట బీడీలకి. ఆ తాతల కాలంనాటి సంచిని పూరకేయిచ్చినా ఎవరూ తీసుకోరని వాడికిచ్చి పంపాను. అదీ అమ్మేశాడు వెధవ!"

ఇలా చాలా జోక్స్ ఉన్నాయి వాకుమీద ఏ వస్తువు ఎక్కడ ఎంతకి లాభకరంగా అమ్మొచ్చోవాడికి తెలిసినట్లు మరెవ్వరికీ తెలియదు.

కథ ముగించి, పుస్తకంమూసి గదిలోంచి బయటకి నడిచాను. వామన రావు ఎవరితోనో కబుర్లు చెప్తున్నాడు వుపనయనం చూడటానికి వచ్చిన వాళ్ళతో.

"పెద్దన్నయ్య చండీఘర్‌లో ఓకాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. రెండో అన్నయ్య అక్కడే ఎం. ఏ. చదువుతున్నాడు. పెద్దక్కయ్య త్రివేం ద్రంలో ఉంది. నేను ఇంటర్ మీడియట్ చదువుతున్నాను."

వాడు చెప్పిన అఖరి విషయం అబద్ధం అని నాకు తెలుసు. వాళ్ళింట్లో అంతా పైకొచ్చారు. ఆలనా, పాలనా లేకుండా ఇలా అయిపోయాడే అని నాకు వాడిమీద ఓవిధమైన జాలి. ఉపనయనానికి, రెండో మామయ్య ఇంటికి వచ్చిన వాళ్ళంతా ఎవరి జాగ్రత్తలో వాళ్ళున్నారు. సూట్‌కేసులు, ట్రంక్

పెట్టెలు ఎప్పుడూ తాళంవేసే వుంచుతున్నారు. బాత్‌రూంలో ఆఖరికి సబ్బు కూడా మర్చిపోకుండా పెట్టెల్లో దాచుకుంటున్నారు. ఎందుకయినా మంచిదని వామనరావుమీద ఓ కన్ను వేసి ఉంచుతున్నారు అంతా.

వామనరావుని ఎవరు పిలిచారో నాకు తెలియలేదు. చాలా ఆశ్చర్యం. ఎలా తెలుసుకున్నాడో భట్టిప్రోలునుంచి వచ్చాడు.

వామనరావులో గొప్పతనం ఒకటుంది. తను దొంగని అందరూ గ్రహించి ఎవరి జాగ్రత్తల్లో వాళ్ళుంటున్నారనీ, తనని దగ్గరకు చేరనీయటం లేదనీ తెలిసినా అసలు అది గ్రహించనట్లే ఉంటాడు. బిడియపడడు. చాలా మామూలుగా మసలుతాడు అందరితోనూ.

రెండో మామయ్య కొద్దిగా ఇరకాటంలో పడ్డాడు. చూస్తూ వామన రావుని తన ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని చెప్పలేడు. ఉంటే జరిగే నష్టం భరించ లేడు.

నవ్వొచ్చింది నాకు రెండో మామయ్యని చూస్తే. పీటలమీద కూర్చుకి కొడుకు చెవులో గాయత్రీ మంత్రం. గోత్రం చెబుతున్నా, చూపులూ మనసు వామనరావు మీదనే.

"ఎలా తెలిసిందిరా నీకు ఈ ఉపనయనం గురించి?" అడిగాను వామనరావుని.

"ఎవరో రాశారు నాకు కొవ్వూరు నుంచి"

"ఎవరు రాశారు."

"ఏమో పేరు రాయలేదులే."

"మరి కొవ్వూరని ఎలా తెలుసు?"

"పోస్టల్ ముద్ర చూసి కనుక్కొన్నాను."

"కొవ్వూరు నుంచి పెద్దమ్మ కొడుకు రాశాడేమో?"

"ఆయన చేతివ్రాతకాదు. మీరెవరో ఓ అయిదు రూపాయలుంటే ఇవ్వ" అడిగాడు.

"దేనికి?"

"భిక్ష చదివిస్తాను. లేకపోతే బాగుండదు."

"నీవు వాడికన్నా, చిన్నవాడిని చదివించక్కరలేదు."

"సరే అయితే."

వెళ్ళిపోయాడు బయటకి.

మధ్యాహ్నం భోజనాలయాక. మళ్ళీ అల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ ఎడిట్ చేసిన పేపర్ బేక్ తీశాను. మా బంధువుల్లో పెళ్ళీడుకు వచ్చిన ఇద్దరు కూతుళ్ళున్న ఓ ముసలాయన నా పక్కకు చేరాడు.

"ఏరా? ఎప్పుడు నీ పెళ్ళి?" అడిగాడు నావంక చూస్తూ.

"ఇప్పుడప్పుడే కాదు" అన్నాను పుస్తకం ముడిచి.

"ఇంకా ఎన్నాళ్ళురా?"

"కానీ తొందరేం?"

"అది కాదురా. ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి. బంధువుల్లో మనవాళ్ళు ఎంతమంది లేరు! ఊ అంటే చాలునువ్వు లక్షణంగా పెళ్ళిచేసుకో నా మాట విని."

విసుగ్గా చూశాను ఆయన వంక.

"ఎవరో అమ్మాయిని పెంచుకుంటానని విన్నాను" అడిగాడు.

"అవును."

"ఏం?"

"ఏం ఏమిటి? చివరలో నన్ను మీరు చూస్తారా?" మీ అమ్మాయిలు చూస్తారా?"

"అయితే ఇక పెళ్ళి చేసుకోవా?" కోపంగా అడిగాడు.

"కోను."

"ప్రతీవాడు ఇలా పెళ్ళి వద్దంటూంటే పెళ్ళికాని అమ్మాయిలు ఏమయిపోవాలిరా?"

అడిగాడు రుసరుస లాడుతూ.

సమాధానం దగ్గర లేదుకాబట్టి చెప్పలేదు.

"ప్రతీ మొగాడికీ ఓ భార్య అవసరం ఎంతయినా ఉంది."

ముసలాయనని ఉడికించాలనుకున్నాను.

"ఇప్పుడు నాకేం తక్కువయిందని? అయినా సొంత భార్యే అయి వుండాలా ఏమిటి?"

"అప్రాచ్యపు మాటలు మాట్లాడకు" కోపంగాలేచి వెళ్ళిపోయాడు ముసలాయన. కండువా దులిపుకుని.

పుస్తకం తెరిచాను మళ్ళీ. నవ్వుకుని ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. చదువుతూనే, కొద్దిగా నిద్ర వస్తూంటే, బెడ్డింగ్ మీద పడుకున్న నాకు నిద్ర పట్టేసింది.

అరుపులు, కేకలు విని మెలకువ వచ్చింది నాకు. చేతి గడియారం వంక చూసుకొన్నాను. అరగంట సేపే నేనే పడుకుంది. మొహం చన్నీళ్ళతో కడుక్కొని లోపలికి వెళ్ళాను.

"మనం అనుకొంటూనే ఉన్నాం. అనుకొన్నంతా జరిగింది."

"ఇంతమంది కళ్ళలో కారంకొట్టి ఎంతపని చేశాడో"

"ఏం జరిగింది?" అడిగాను నేను.

రెండో మామయ్య కూతురు ఏడుస్తోంది. దానితో పాటు దాని పక్కనే కూర్చుని ఉన్న నాలుగేళ్ళ పిల్లకూడా ఏడుస్తోంది భయంగా.

"ఏమయింది?" అడిగాను మళ్ళీ.

"వాడే వెధవ. దీని మెళ్ళోని బంగారం గొలుసు కొట్టేశాడు వెధవ."

రెండో మామయ్య కూతురు ఏడుస్తూ చెప్పింది.

"వామనరావేనా?" అడిగాను.

"ఇంకెవరు? వాడే."

"ఎన్ని తులాలు?" అడిగారు ఎవరో.

"నాలుగు. డబ్బు లేదంటే పోరి అప్పుచేయించి కొనిపించాను ఆయన చేత. ఇప్పుడు ఇంటికి వెళ్ళాక ఈ సంగతి చెబితే చీపురు తిరగేస్తారు ఆ తిక్క మనిషి"

భర్త గురించి చెప్పింది. పాపం నాకు తెలుసు, ఆయన ఏదో చిన్న గుమాస్తా. ఇంత ఖరీదయిన గొలుసు కొనుక్కునే తాహతులేదు ఆయనకి అసలే కోపిష్టి.

"ఏడీ వాడు?" అడిగాను కోపంగా.

"కావలసింది దొరికిందిగా ఇంకెందుకు వుంటాడక్కడ. భట్టిప్రోలు వైపు వెళ్ళే రైలు ఎక్కేసి ఉంటాడు" అన్నాడు పెద్దమ్మకొడుకు.

"ఈపాటికి ఎక్కడో అమ్మేసి ఉంటాడు. ఏదయినా వస్తువు దొరికితే చాలు, అది అమ్మేదాకా వాడికి నిద్రపట్టదు అన్నాడు" పెదమామయ్య పళ్ళు పటపట కొరుకుతూ.

"మొహమాటపడకుండా ముందరే పొమ్మనాల్సింది. ఈసారి ఎవరింటికీ రానీకూడదు. బాగా బుద్ధొచ్చింది" అన్నాడు రెండో మామయ్య.

నాకు వామనరావుమీద ఒళ్ళు తెలియని కోపం వచ్చింది.

"పోలీస్ రిపోర్టు యిచ్చి వస్తాను మామయ్యా" అన్నాను చొక్కా తొడుక్కుంటూ.

"వద్దురా బాబు అయినదానికి చాలు. తన కొడుకుని పోలీసులచేత కొట్టించి. జైల్లోకి తోయించానని అది నామీద పడి ఏడుస్తుంది" అన్నది పోయిన మామయ్య పెద్ద కూతురు.

"ఛ ఛ. మన వంశంలో తప్పపుట్టాడు వెధవ వేలెడంత లేడు. ఈసారి కనపడనీ చావచితక తంతాను ఎవరేం అనుకున్నా ఫరవాలేదు" అన్నాడు పెదమామయ్య.

"ముందరే జాగ్రత్త పడవద్దా అందరిలాగా" అన్నాను నేను.

"జాగ్రత్తగా లేకపోతే ఎప్పుడో పోయేది ఉండబట్టే ఇంతసేపయినా దాని మెళ్ళోవుంది బాత్రూంలోకి వెళుతూ దాన్ని బయట నిల్చోబెట్టాను ఓ

నిమిషం అయిందో లేదో అంతే. వచ్చి చూసేసరికి అది లేదు అంతే. పైన వుంది. మెళ్ళో గొలుసులేదు వామనరావు లేడు!"

"ఇంత సేపూ ఇక్కడే చచ్చాడుగా" అన్నది ఓ ముసలావిడ. అందరూ తలో మాట అన్నారు.

రాత్రి ఎనిమిది గంటలకి వచ్చాడు వామనరావు అకస్మాత్తుగా. నోట్లో కిళ్ళీతో రాగానే అంతా మీద పడ్డారు.

"ఎక్కడికి వెళ్ళొస్తున్నావురా?" అడిగారు పెద్ద మామయ్య.

"ఓ స్నేహితుడి దగ్గరికి?"

"ఇంత సేపూ ఏం చేస్తున్నావు?"

"సినిమాకి వెళ్ళాం."

"డబ్బెక్కడిది?"

"వాడే తీసుకెళ్ళాడు."

అబద్ధం చెప్తున్నాడని వాడి మొహమే చెప్తోంది.

"ఆ గొలుసిటివ్వు."

"ఏమిటి?"

"గొలుసు"

"ఏ గొలుసు?"

"ఏం గొలుసా?"

పెదమామయ్య వామనరావు చెంప ఛెళ్లుమనిపించారు.

"ఆ గొలుసే" అరిచారు కోపంగా.

వామనరావు చెయ్యి అప్రయత్నంగా చెంపమీదకి వెళ్ళింది. అంత గట్టిదెబ్బ ఎప్పుడూ తినివుండడు కళ్ళమ్మట నీళ్లు తిరిగాయి.

"నాకు తెలీదు. నేనే గొలుసు తీయలేదు."

ఏడుపు ఆపుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

"నీకు పుణ్యముంటుంది చెప్పరా. ఎక్కడ ఎవరికి అమ్మావు? వెళ్ళి

తెచ్చుకుంటాం. అది లేకపోతే చంపేస్తారు ఆయన" అన్నది రెండో మామయ్య కూతురు బ్రతిమాలుతూ.

"నాకు తెలీదు"

"తీయలేదూ?"

జుట్టు పట్టుకున్నాడు పెద మామయ్య. మామయ్య కోపం గురించి తెలుసు కాబట్టి, నేను జోక్యం కలుగజేసుకుని విడిపించాను వామనరావుని.

అందరూ తనవంకే అసహ్యంగా చూడటం గమనించాడు వామన రావు జేబులోంచి కొంత చిల్లర తీసి నేలమీదకి విసిరికొట్టి గిరుక్కున వెనక్కి తిరిగి పరుగెత్తాడు. గలగల చప్పుడు చేస్తూ నేలమీద దొర్లాయి నాణాలు.

"ఖర్చు పెట్టేసి ఉంటాడు అంతా. చిల్లర మిగుల్చుకొచ్చాడు."

పెద్దమ్మ కొడుకు వంగి చిల్లర ఏరి, లెక్కపెట్టి అందించాడు మామయ్య కూతురుకి.

మామూలే, అంతా తలో మాట అన్నాడు మళ్ళీ.

o o o

ఒకతను సన్నగా ఉన్నాడు సూటు, బూటు మొహంలో ఓ ప్రత్యే కత నవ్వు పట్టిస్తుంది. ఆ ప్రత్యేకత.

మరొకతను బాగా లావుగా ఉన్నాడు. సూటు, టై, సన్నగా ఉన్నతని మొహంలోని ప్రత్యేకత లావతనిలో ఎక్కువగా లేదు.

ఇద్దరూ జూలోని, బోనులోవున్న ఓ సింహం దగ్గర ఉన్న మాంసం ముక్కని లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారు.

"భయపడకు. ఆ సింహం కళ్ళలోకి సూటిగా చూడు. అలా చూస్తే నిన్ను చూసి భయపడుతుంది సింహం. ఎక్కడో పుస్తకంలో చదివాను."

"సరే."

సన్నగా వున్నతను రెండడుగులు ముందకి వేసి, ఆగిపోయి అను మానంగా వెనక్కి తిరిగి అడిగాడు.

"మరి ఈ సింహంకూడా ఆ పుస్తకం చదివిందా?" అర్థమయిన వాళ్ళంతా నవ్వుతున్నారు.

లారెల్ అండ్ హార్డీ!

స్టేన్లీ లారెల్ అండ్ ఆలివర్ హార్డీ నటించిన సినిమా అది. ఒడుగుకు, హైద్రాబాద్‌కు వచ్చిన నేను మర్నాడు హాస్యనట ద్వయం సినిమా "నథింగ్ బట్ ట్రబుల్" చూస్తున్నాను. ఓ ఎయిర్ కండీషన్డ్ థియేటర్‌లో.

లారెల్ అండ్ హార్డీ సినిమాలంటే నాకు ప్రాణం. అందుకనే ఒక సారి చూసినా, మళ్ళీ వచ్చాను దానికి. హాలంతా నవ్వులతో నిండిపోయింది- సింహం గట్టిగా గర్జించింది బోనులో నుంచి.

లావుగావున్న హార్డీ వెనక్కి తిరిగి చూసి అడిగాడు. పది అడుగుల దూరంలో వున్న ఎత్తయిన గోడమీద కూర్చుని లారెల్‌ని చూసి.

"ఆ పైకి ఎలా వెళ్ళావు?"

"సింహం"

గోడదిగి వచ్చాడు. భయంగా.

వెనకాల రోల్లో కూర్చునివున్న ఇద్దరి గుసగుసలు, నవ్వులు నాకు వినిపిస్తున్నాయి. గుర్తు పట్టాను వాళ్ళని. కాని సినిమా చూస్తున్నందువల్ల మధ్యలో వాళ్ళతో మాట్లాడి వాళ్ళని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక పలకరించ లేదు.

వాళ్ళ మాటలు వినపడుతున్నాయి నెమ్మదిగా. సరీ నా వెనక సీటు లోనే కూర్చోవడంవల్ల నన్ను గమనించినట్లులేరు.

సాధారణంగా వాళ్ళ సినిమాలో వుండే కొట్టుకోవడాలు, గుద్దుకోవ టాలు, పొడుచుకోవటాలు లేవు ఈ సినిమాలో. చాలా సున్నితంగా హాయిగా వుంది హాస్యం.

కాని నా దృష్టి సినిమామీద లేదు, కళ్ళు చూస్తున్నా, వెనకాల సీటు లోంచి వినబడుతున్న మాటలమీద ఉంది మనసు. నా ప్రయత్నం లేకుండానే వినపడుతున్నాయి మాటలు, వాళ్ళిద్దరివీ.

"ఎప్పుడిస్తారట?"

"నాలుగు రోజుల తర్వాత."

"సరిగ్గా నాలుగు కాసులుందా ఆ గొలుసు?"

"పూర్తిగా లేదు. మూడున్నర వుంది కొంచెం తక్కువగా."

"మరి అంత ఏడ్చిందే నాలుగుందని."

కాసేపు నిశ్శబ్దం.

"మెరుగు పెట్టమని చెప్పారా?"

"అక్కర లేదన్నాడు. అవో మూడున్నర. మనం ఇచ్చింది రెండున్నర. మొత్తం ఆరు కాసులయిందా ఇంక పెద్ద దాని పెళ్ళికి గొలుసు మళ్ళీ చేయించక్కరలేదు. అయినా ఇంకెంత? నెలరోజులేగా దాని పెళ్ళి."

"పోన్లెండి, ఎన్నాళ్ళకయితేనేం ధైర్యం చేశారు చివరకి."

"ఆ పసిపిల్ల చెబుతుందేమోనని భయపడ్డాను సుమా."

వాళ్ళు— తెరమీదకి వచ్చారు హాస్యద్వయం.

వెనకాల కూర్చున్న మా పెద్దమ్మ కొడుకు, అతని భార్య మాటలు ఆగిపోయాయి. నవ్వులు వినబడుతున్నాయి ఇప్పుడు.

సినిమా అయిపోయింది పావుగంటలో. ఈ పావుగంటలో నేను విన్న మాటల సారాంశం పూర్తిగా అర్థమయిపోయింది నాకు.

"మీరూ వచ్చారా?" అడిగాను "జనగణమన" ఆపగానే పలకరింపుగా.

"అవును."

ఉలిక్కిపడ్డాడు పెద్దమ్మ కొడుకు.

కంగారు పడింది పెద్దమ్మ కొడుకు భార్య.

"బాగుందికదా సినిమా?" అడిగాను నవ్వి.

"బాగుంది." ఇద్దరూ ఒక్కసారే సమాధానం చెప్పారు.

"మరి మాట్లాడుతూనే ఉండిపోయారే చాలాసేపు?"

"వెళ్తాం. అర్జెంట్ పనివుంది."

"అలాగే."

నిజంగా పెద్దమ్మకొడుకు దురదృష్టం నేను ఆ ముందు సీట్లో కూర్చొని సినిమా చూడటం, వాళ్ళ మాటలు వినడం అయినా సినిమాలోనా గొలుసు సంగతి? హడావిడిగా వెళ్ళిపోయారు ఇద్దరూ.

తర్వాత వామనరావుని కలుసుకుందామని ప్రయత్నం చేశానుకాని, దొరకలేదు వాడు ఇంకా.

o o o

అవును బంగారాన్ని గీటురాయి పరీక్షిస్తుంది. మనిషిని బంగారం పరీక్షిస్తుంది. ●

(ఆంధ్రజ్యోతి వారపత్రిక, 11-5-1973 సంచిక)